క్లుప్తంగా

13న ఐటీఐలో జాబ్‌మేళా

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఐటీఐలో ఫిట్టర్ ట్రేడ్ పాస్ అయిన అభ్యర్థులు జాబ్ మేళాలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలకు ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు.

వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగం

ప్రభుత్వ ఐటీఐతో లాజిస్టిక్ స్కిల్ కౌన్సిల్ వారితో జరిగిన ఒప్పందం మేరకు 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల స్త్రీ, పురుషులకు స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి వేర్‌హౌస్ అసోసియేట్‌గా ఉద్యోగం కల్పించడం జరుగుతుందని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా ఐటీఐలో సంప్రదించాలన్నారు. ఉద్యోగం పొందిన వారికి వారానికి ఐదు రోజులు మాత్రమే పని ఉంటుందన్నా రు. ఇతర వివరాలకు 08816 96760 99988 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జూదరుల అరెస్టు

పాలకోడేరు: పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోగల్లు పల్లకోడు శివారు దక్షిణం కాలువ వద్ద గురువారం పేకాట స్థావరంపై ఎస్సై సిబ్బందితో కలిసి దాడి చేసి 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

సకాలంలో చిన్నారులకు వ్యాక్సిన్లు వేయించాలి



ఆరవల్లిలో జాగ్రత్తలను వివరిస్తున్న దృశ్యం

అత్తిలి: చిన్నారులకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలని మంచిలి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశాన్ అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో గురువారం చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది ప్రసాద్, విజయలక్ష్మి, ఆశ వర్కర్లు ధనలక్ష్మి, మాధవి, రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ఆవశ్యకతపై ఎస్పీ అవగాహన



ఐ.భీమవరం రోడ్డులో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

ఆకివీడు: వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకు ముప్పు తప్పదని ఎస్పీ యు.రవిప్రకాష్ వాహనచోదకులను హెచ్చరించారు. స్థానిక ఐ.భీమవరం రోడ్డులో హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన చోదకులను నిలిపి హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. అతి వేగంగా వాహనాలు నడపడం ప్రాణాలకు ముప్పు అని, హెల్మెట్ లేకపోవడం మరింత ప్రమాదకరమని ఎస్పీ పేర్కొన్నారు. ఐ.భీమవరం రోడ్డులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనపై ఎస్పీ ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు, మరణాలు తగ్గే విధంగా పలు చర్యలు చేపట్టాలని సీఐ, ఎస్సైలకు సూచించారు.

విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలు

పాలకొల్లు అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో నెల రోజుల సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. గురుకుల్ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలను రోటరీ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ రోజు స్కిప్పింగ్ ఆడటం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. ఈ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బహుమతులు అందజేస్తామని వివరించారు. క్లబ్ కార్యదర్శి రావాడ సతీష్, కోశాధికారి ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, మద్దాల వాసు, చందక రాము పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో 20.2 మి.మీ వర్షపాతం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 20.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ గురువారం తెలిపారు. పెంటపాడు మండలంలో 15.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

శివారుకూ పూర్తిగా తాగునీరు అందిస్తాం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- కోలమూరులో పైప్‌లైన్ విస్తరణ పనుల ప్రారంభం



కోలమూరులో పైప్‌లైన్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పీవీఎల్

ఉండి: నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండి మండలం కోలమూరులో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో బీసీ, ఎస్సీ కాలనీలలో పైపులైన్ విస్తరణ పనులకు పీవీఎల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టి గ్రామ శివారు ప్రాంతాల్లో కూడా తాగునీటి సరఫరా మెరుగుపరిచామన్నారు. గత వేసవిలో సమృద్ధిగా తాగునీరు సరఫరా చేశామన్నారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమ నిధులు, జెడ్పీ, మండల పరిషత్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎక్కడా ప్రజలు ఇబ్బందులు పడకూడదని నిధులు సమృద్ధిగా అందించి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సీసీ రోడ్లు, పక్కా డ్రెయిన్లు నిర్మించి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో సమస్యలను మరింతగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం ముగిసిన ప్రతి సచివాలయ పరిధిలో ప్రభుత్వం అందించే రూ.20 లక్షలతో వెంటనే గ్రామంలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కష్టపడుతున్నారని, వారి అవసరాలు, సమస్యలను వారికంటే ముందుగా అధికారుల ద్వారా గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసి పరిష్కరిస్తున్నారన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు గ్రామాభివృద్ధి చేస్తూ సీఎం వైఎస్ జగన్ ముందుకు దూసుకుపోతున్నారన్నారు. ప్రతిపక్షాలు వక్రదృష్టితో చూస్తూ ప్రజాసంక్షేమాన్ని భరించలేకపోతున్నారన్నారు. నిరుపేదలు అభివృద్ధి చెందడం చంద్రబాబుకు కంటగింపుగా ఉందని విమర్శించారు. నాయకుల అభివృద్ధే అందరి అభివృద్ధి అని గత ప్రభుత్వ పెద్దలు నిర్వచనాలు చెప్పారని, కానీ ఇప్పుడు నేరుగా ప్రజల చెంతకే ప్రజాసంక్షేమం వస్తుంటే అభివృద్ధి లేదంటూ గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. ఎవరు ఎంతగా వక్రభాష్యాలు చెప్పినా జగనన్న ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. చేసిన అభివృద్ధి చెప్పి ప్రజలను ఓట్లు అడుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నడింపల్లి సత్యవతి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఉప సర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు, ఎంపీటీసీ సభ్యులు అల్లూరి మాధవి, పార్టీ సీనియర్ నాయకులు గండ్రాజు రాజేష్‌వర్మ, పేరిచర్ల కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

భీమవరం (ప్రకాశంచౌక్): జువ్వలపాలెం రోడ్డులో ఉన్న శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకుని గురువారం శ్రీకృష్ణునికి సహస్రనామార్చన పూజ, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

ఆక్వా రైతులను ఆదుకుంది జగన్ ప్రభుత్వమే

- క్షత్రియులకు అత్యధిక గుర్తింపునిచ్చింది సీఎం వైఎస్ జగనే
- జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్ రాజు

కాళ్ల: ఆక్వా రైతులను అన్ని విధాలా ఆదుకున్నది ఒక్క వైఎస్ జగన్ ప్రభుత్వమేనని జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు స్పష్టం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆక్వా రైతులకు అన్యాయం చేసినట్లు యువగళం పాదయాత్రలో ఆక్వా రైతుల సమావేశంలో లోకేష్ మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా ఉండి ఎమ్మెల్యే ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలడంపై అసహనం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం చిత్తశుద్ధితో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ, మేత రేట్లు, సీడ్ రేట్లు తగ్గించారన్నారు. పలుమార్లు రొయ్యల ధరలను ఎగుమతిదారుల సిండికేట్ తగ్గించిన సమయంలో కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి సబ్ కమిటీలు వేసి రైతులకు మేలు జరిగేలా చేశారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఆక్వా రైతులకు ఏ మేలు జరగలేదన్నారు. కానీ లోకేష్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పాలనలో క్షత్రియులకు ఏం మేలు చేశారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ గత ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో క్షత్రియులకు ఒక సీటు, ఒక ఎంపీ సీట్లు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. అంతేకాకుండా టీడీపీ ఐదేళ్ల పాలనలో క్షత్రియులకు క్యాబినెట్ హోదా కూడా ఇవ్వలేదని ఘాటుగా విమర్శించారు. కానీ వైఎస్ జగన్ క్షత్రియులకు మూడు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు ఇచ్చి ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు మంత్రి పదవి ఇవ్వటంతో పాటు ముదునూరి ప్రసాదరాజుకు క్యాబినెట్ హోదా కలిగిన ప్రభుత్వ చీఫ్ విప్ పదవి ఇచ్చారన్నారు. అదేవిధంగా క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దివంగత నేత పాతపాటి సర్రాజుకు చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. ఆయన అనంతరం ఆయన తనయుడు శ్రీనివాసరాజుకు ప్రత్యేక స్థానం కల్పించి చైర్మన్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా డీసీసీబీ చైర్మన్ పదవి క్షత్రియులకు కేటాయించారన్నారు. పీవీఎల్ నరసింహారాజును డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగిస్తున్నారన్నారు క్షత్రియకు అత్యధిక గుర్తింపుని ఇచ్చింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒకరేనని అన్నారు. అలాగే గాదిరాజు వెంకట సుబ్బరాజుకు టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం ఇచ్చారన్నారు. లోకేష్, టీడీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌పై ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మరని, క్షత్రియులు వైఎస్ జగన్ వెంటే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.

ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తా



భీమవరంలో మోషేన్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లో ప్రకాశం పంతులు విగ్రహం నెలకొల్పడానికి తన వంతు కృషిచేస్తానని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. గురువారం ప్రకాశం పంతులు విగ్రహ ఏర్పాటు కమిటీ మోషేన్‌రాజును కలసి విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. కులమత, రాజకీయాలకు అతీతంగా విగ్రహం ఏర్పాటుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నందున సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రమణ్యం, నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు వినతిపత్రం అందించారు.

ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

ఉండి: ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని ప్రముఖ కీళ్ల వ్యాధుల వైద్యుడు డాక్టర్ శశికాంత్ అన్నారు. గురువారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎముకలు, కీళ్ల వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 120 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ ఎముకలు అరిగిపోవడం వల్ల మోకాళ్ల నొప్పులు వస్తాయన్నారు. ఇలా జరుగుతున్నప్పుడు కింద కూర్చోకూడదని, మెట్లు ఎక్కకూడదని సూచించారు. అనంతరం క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూతకళ మాట్లాడుతూ హైదరాబాద్ స్టార్ ఆసుపత్రి వైద్యుడు శశికాంత్ ఇలా ఉచిత వైద్య శిబిరంలో సేవలందించడం అభినందనీయమన్నారు. శిబిరానికి దాత సాగిరాజు సాంబశివరాజు నేతృత్వం వహించారు. గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, కాగిత మహంకాళి, గాదిరాజు వెంకటేశ్వరరాజు, సత్తి బ్రహ్మారెడ్డి, నంబూరి కాశీవిశ్వేశ్వరరావు, కలిదిండి సీతారామరాజు, బొండాడ బ్రహ్మానందం పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్యామల

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని వార్డుల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ ఎం.శ్యామల గురువారం పరిశీలించారు. ఆర్టీసీ డిపో, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్, ఇండస్ట్రియల్ ఏరియా, కుముదవల్లి రోడ్‌లను తనిఖీ చేశారు. పట్టణంలోని పారిశుద్ధ్య మెరుగుదలకై పలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి 100 శాతం వేరుచేసిన వ్యర్థాలను సేకరించాలని ఆదేశించారు. అలాగే ప్రజల వద్ద నుంచి వసూలు చేస్తున్న క్లాప్ యూజర్ చార్జీల ఎప్పరోగతి కనబరిచి క్లాప్ వెహికల్ సామర్థ్యాన్ని 100 శాతం ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందజేత



దండగర్ర హైస్కూల్ విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: చిరునవ్వు సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు గురువారం జాతీయ ప్రతిభ అన్వేషణ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తిరుమల సూరిబాబు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుని స్కాలర్‌షిప్ సాధించి, ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గట్టి కృష్ణ, బాలాజీ, అల్లూరి శ్రీనివాస్, పీఆర్వో గోగు వంశీకృష్ణ, కోశాధికారి పత్తి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణ క్లబ్ సేవలు అభినందనీయం

తణుకు టౌన్: స్వర్ణ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని స్వర్ణ క్లబ్ అధ్యక్షురాలు చిట్టూరి సుజాత ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు గురువారం సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని సత్కరించారు. అనంతరం సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ క్లబ్ కార్యదర్శి సుంకవల్లి చిరంజీవిని కుమారి, లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ డి రంగారావు, జిల్లా క్యాబినెట్ డిప్యూటీ కార్యదర్శి వావిలాల సరళాదేవి పాల్గొన్నారు.

పండుగలు ఐక్యతను చాటుతాయి



ములపర్రులో కోలాట భజన బృందానికి హుమతి అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ మిస్సి, ఎంపీపీ

పెనుగొండ: పండుగలు గ్రామాల్లో ఐక్యతను చాటి చెబుతాయని పెనుగొండ ఎఎంసీ చైర్మన్ వెలగల వెంకట రమణ(మిస్సీ) అన్నారు. కృష్ణాష్టమి ఉత్సవాలు సందర్భంగా ములపర్రు కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం, ఉట్టికొట్టుడు కార్యక్రమాల్లో విజేతలకు గురువారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడాలంటూ శ్రీకృష్ణుడు ఉపదేశించిన మార్గాన్ని ప్రతీ ఒక్కరూ ఆచరించాలని కోరారు. కృష్ణాష్టమి వేడుకలు పెనుగొండ మండలంలో పెనుగొండ, వడలి, సిద్ధాంతంల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), రాష్ట్ర ఉమెన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టరు బొక్కా అరుణ, సంస్థ అధ్యక్షుడు బొక్కా రమణ, సమరసత సేవా సమితి కన్వీనర్ చింతాకుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వడలిలో పొలంబడిలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి స్పందన

పెనుగొండ: వరి పంటను ఆకు ఎండు తెగులు, మాగుడు తెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు స్పందించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పి.స్పందన సూచించారు. గురువారం వడలిలో పొలంబడి నిర్వహించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. యాజమాన్య పద్ధతులు రైతులు విధిగా పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి రైతులకు అండగా నిలవడానికే ప్రభుత్వ ఆదేశాల మేరకు పొలంబడి నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులు పొలం బడిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్ నమోదుకు రైతులు పంట రకాలను ఆర్‌బీకే కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

సూర్యమండల ఆకృతిలో పెరటి తోటల సాగు



సూర్యమండల ఆకృతిలో పెరటి తోటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యలమంచిలి: సూర్యమండల ఆకృతిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పెరటి తోటలను సాగు చేయడం వలన ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించవచ్చని సేంద్రీయ వ్యవసాయ శాఖ పాలకొల్లు డివిజన్ ఇన్‌చార్జి పి.అప్పారావు చెప్పారు. కాంబొట్లపాలెంలో గురువారం పార్కి సత్యనారాయణ తోటలో సూర్యమండల ఆకృతిలో వివిధ జాతుల పంటలు ఏ విధంగా పండించాలో? ఆయన వివరించారు. ముందుగా సూర్యమండల ఆకృతిలో భూమిని దున్నించి, దున్నిన భూమిని ఏడు భాగాలు చేశారు. ఒక్కో భాగంలో దుంప జాతికి చెందిన కారెట్, పసుపు, ముల్లంగి, ఆకు జాతికి చెందిన తోటకూర, గోంగూర, మెంతుకూర కాయ కూరల జాతికి చెందిన వంకాయ, టమోట, బెండ, మిర్చి తీగ జాతికి చెందిన ఆనప, కాకర, బీర, దోస పెద్ద పండ్ల జాతికి చెందిన మామిడి, పనస చిన్న పండ్ల జాతికి చెందిన బొప్పాయి, మునగ బోర్డర్ క్రాపుగా బంతి, మొక్కజొన్న, ఆముదం మొక్కలు ఎలా పెంచాలో వివరించారు. ఈ విధంగా మొక్కలు వేసి ద్రవ, ఘన జీవామృతాలు, కషాయాలతో సాగు చేయడం వల్ల ఎలాంటి పురుగుమందుల అవశేషాలు లేని ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని అప్పారావు తెలిపారు. అలాగే గ్రామంలో ఉన్న డ్వాక్రా మహిళలంతా తమ ఇంటి పెరటిలో పురుగు మందులు చల్లకుండా ప్రకృతి సిద్ధమైన కషాయాలు, కల్చర్ జీవామృతం పిచికారీచేసి కాయకూరలు పండించుకుని వాటిని తిని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.జ్యోతి, జడ్డు లక్ష్మీనారాయణ, బండి లక్ష్మీదుర్గ, కంకటాల శాంతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పోడూరు: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి పీతల రాజమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, ఉద్యోగులకు వయస్సుతో నిమిత్తం లేకుండా పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రతీనెలా 1నే జీతాలు ఇవ్వాలనీ, పదవీవిరమణ ప్రయోజనాలు కల్పించాలని కోరారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

పోడూరు: మండలంలోని కొమ్ముచిక్కాల శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్ముచిక్కాల, కాపవరం, వాలమర్రు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

మాజీ ఎంపీపీ కందులకు సతీవియోగం



నాగమణి పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి

కాళ్ల: మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కందుల వెంకట మల్లికార్జునరావు భార్య బొండాడ మాజీ సర్పంచ్ నాగమణి (59) గురువారం స్వర్గస్తులయ్యారు. ఇటీవల కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బొండాడలోని ఇంటి వద్ద గురువారం మృతి చెందారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విచ్చేసి ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, గాదిరాజు సుబ్బరాజు, తోట ఫణిబాబు, మన్నే నాగరాజు తదితరులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఐటీఐలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేయండి

ఉండి: జిల్లాలోని 2 ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను నాలుగో విడత ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ (ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట)లలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పరిశీలన చేయించుకోవాలని సూచించారు. అడ్మిషన్‌ల కొరకు ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో లేదా 08816 297093 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

90 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో 90 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసినట్లు మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెప్పారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం, తుందుర్రు, పెదగరువు తదితర గ్రామాలలో సుమారు 7 వేల ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారన్నారు. 90 శాతం ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు. మిగిలిన 10 శాతం రైతులు త్వరితగతిన ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల పంట విక్రయం, పంటల బీమా, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆర్‌బీకే సెంటర్లలో బుక్ చేసుకుంటే 48 గంటల్లో అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: మండలంలో నాలుగు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ కందుల వాణీ గురువారం చెప్పారు. మండలంలోని అజ్జమూరు (బీసీ-ఏ) జనరల్, మందపాడు వలంటీర్ పోస్టుకు ఓసీ జనరల్, ఆకివీడు-3 సచివాలయ పరిధిలోని మాదివాడలో సీ1, సీ2 క్లస్టర్‌లో ఓసీ జనరల్ పోస్టులకు దరఖాస్తుల్ని ఈ నెల 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయా సచివాలయాల పరిధిలో 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, 35 సంవత్సరముల లోపు ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 13న జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజనల్, ఫొటోస్టాట్ సర్టిఫికెట్‌లు అందజేయాలన్నారు. 14న కమిటీ ద్వారా ఎంపికై న నూతన గ్రామ వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తామని ఎంపీడీఓ వివరించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

వీరవాసరం: వీరవాసరం పీహెచ్‌సీ ఏఎన్ఎం సంధ్యారాణిని తోకలపూడి హెల్త్ అసిస్టెంట్ సాయి సూర్యారావు దూషించారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరవాసరం ఎస్సై పి.రమేష్ ఇటీవల అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ గురువారం వీరవాసరం పీహెచ్‌సీలో విచారణ చేశారు. విచారణలో భాగంగా ఫిర్యాది సంధ్యారాణితోపాటు ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న వారి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఆయన వెంట ఎస్సై పి.రమేష్, సిబ్బంది ఉన్నారు.